డిగ్రీ వైపు తగ్గిన మొగ్గు

- 40 శాతం కూడా భర్తీ కాని సీట్లు
- బీకాం కంప్యూటర్స్ చేరిన వారే ఎక్కువ

ఎస్‌టిబిసి డిగ్రీ కళాశాల

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇంటర్‌మీడియట్ తరువాత డిగ్రీ కోర్సులు చదివేందుకు మొగ్గు చూపే వారి సంఖ్య తగ్గుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో ఈ ఏడాది 40 శాతం సీట్లు కూడా భర్తీ కాలేదు. డిగ్రీ చేరిన వారిలోనూ బీకాం కంప్యూటర్స్‌లో చేరిన వారే ఎక్కువగా ఉన్నారు..

డిగ్రీలో చేరే వారి సంఖ్య తగ్గిపోతోంది. ప్రవేశం పొందిన వారిలోనూ ఎక్కువగా బీకాం కంప్యూటర్స్‌లో చేరారు. సాధారణ బిఎ కోర్సుల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో ఉన్న సీట్లలో ఇప్పటి వరకు 40 శాతం కూడా భర్తీ కాలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో దాదాపు 15వేలకు పైగా డిగ్రీ సీట్లు ఉండగా ఇప్పటి వరకు 6,234 మంది విద్యార్థులే ప్రవేశాలు పొందారు. చేరిన వారిలోనూ ఎక్కువగా బీకాం కంప్యూటర్స్‌లోనే చేరారు. బీకాం కంప్యూటర్స్‌లో 2,565 సీట్లు ఉండగా 80 శాతం సీట్లు ఇప్పటికే భర్తీ అయ్యాయి. కర్నూలు నగరంలోని పది ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో 80 శాతం పైగా సీట్లు భర్తీ అయ్యాయి. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ 60 సీట్లు ఉండగా అన్నీ భర్తీ అయ్యాయి. నంద్యాలలోని రామకృష్ణ, నేషనల్ పీజీ కళాశాలల్లో 90 శాతం వరకు భర్తీ అయ్యాయి. ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, నందికొట్కూరు, ఆత్మ కూరు, బనగానపల్లి, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనూ ఎక్కువగా బీకాం కోర్సులోనే చేరారు. ఉమ్మడి జిల్లాలోని పలు కళాశాలల్లో ఆర్ట్స్ గ్రూపుల్లో చేరే వారి సంఖ్య భారీగా తగ్గింది. బిఎ చరిత్ర, ఎకనామిక్స్ కోర్సులకు సంబంధించి ప్రతి ప్రభుత్వ కళాశాలల్లో 40 సీట్ల చొప్పున కేటాయించినా విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపలేదు. నంద్యాల జిల్లాలో 600 సీట్లు, కర్నూలులో 150 సీట్లు ఉండగా 30 శాతం భర్తీ కాలేదు. ప్రతి కళాశాలలో బిఎ కోర్సులో 40 సీట్లు ఉండగా నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీలో 16, ఎకనామిక్స్‌లో 14 మంది చేరారు. హిస్టరీ గ్రూపులో ఆళ్లగడ్డలో 11, కోవెలకుంట్ల 16, బనగానపల్లి 14, ఆదోనిలో 12 మంది చేరారు. ఆదోనిలో ఎకనామిక్స్‌లో 9 మంది చేరారు. కర్నూలు నగరంలోని పది ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో హిస్టరీ, ఎకనామిక్స్ కలిపి వంద మంది లోపే విద్యార్థులున్నారు. నంద్యాలలో రెండు ప్రయివేటు కళాశాలల్లో కలిపి 80 మంది చేరారు. సైన్సు కోర్సుల్లో కూడా ఈ ఏడాది అనుకున్నంత మేర అడ్మిషన్లు లేవు. సైన్సు కోర్సుల్లో బిఎస్సీ, బిజడ్‌సి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కర్నూలులోని పది ప్రయివేటు కళాశాలల్లో 45 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 15 సీట్లు, రెండు ప్రైవేటు కళాశాలల్లో 50 శాతం సీట్లు నిండాయి. కౌతాళం, మద్దికెర, అవుకు, కొలిమిగుండ్ల, కోసిగి, మంత్రాలయం, పాణ్యం, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, గడివేముల ప్రాంతాల్లో 30 శాతంలోపే ప్రవేశాలు ఉన్నాయి. ఇంటర్‌లో సైన్సు చదివిన విద్యార్థులు మెడిసిన్, డెంటల్, అగ్రికల్చర్ బిఎస్సీ, వెటర్నరీ, ఫార్మసీ కోర్సుల వైపు వెళ్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రాజ్‌విహార్ వరకు భారీ ర్యాలీ
- రాజ్ విహార్ సెంటర్‌లో కొవ్వొత్తులు, దీపాలతో జూడాల నిరసన
- జిజిహెచ్‌లో జూనియర్ డాక్టర్ల నిరసన ర్యాలీ, విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కోల్‌కతాలోని ఆర్‌జికార్ మెడికల్ కళాశాలలో వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జూడాల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రాజ్‌విహార్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం రాజ్‌విహార్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి కొవ్వొత్తులు, దీపాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పిజిలు, ఎంబిబిఎస్ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఆస్పత్రిలో వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ ఘటనపై సిబిఐతో దర్యాప్తు చేయించాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని, వైద్యుల రక్షణ విషయంలో సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని అమలు చేసేలా రాతపూర్వక హామీ ఇవ్వాలని కోరారు. నాయకులు అచ్యుత్, పవన్ కల్యాణ్, భరత్, భార్గవ్ , ఐఎంఎ నాయకులు డాక్టర్ రామ్మోహన్ రెడ్డి ,డాక్టర్ మాధవి, శ్యామల, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

రాజ్ విహార్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైద్యులు, జూనియర్ డాక్టర్లు

డివైఎఫ్ఐ మద్దతు : కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణంలో ఎపి జూడాలు చేస్తున్న ఆందోళనకు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్‌జికార్ ఆస్పత్రిలో పిజి డాక్టర్ రాత్రి 2 గంటల వరకు వైద్య సేవలందించి, విశ్రాంత తీసుకోవడానికి రూమ్ లేకపోవడంతో సెమినార్ హాలులో నిద్రిస్తుండగా కోల్‌కతా పోలీసు విభాగంలో కాంట్రాక్టు పోలీసుగా పనిచేస్తున్న వ్యక్తి, అతనితోపాటు బృందం అత్యాచారం చేసి హత్య చేశారని తెలిపారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు, పిజిలు ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, నగర కార్యదర్శి హుస్సేన్ బాష, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా నగర కార్యదర్శి సాయి ఉదయ్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి కష్ణ , గురుస్వామి, రజక వృత్తిదారులు సంఘం జిల్లా కార్యదర్శి గురు శేఖర్ ,నగర కార్యదర్శులు శేషాద్రి , శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా సంఘీభావం : ఐద్వా ఆధ్వర్యంలో జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలిపారు. శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ పి.నిర్మల, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అరుణ, ఎన్.అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ నిరసన ర్యాలీలో వైద్యులు, జూనియర్ డాక్టర్లు

జూనియర్ డాక్టర్లకు సంఘీభావ ప్రదర్శనలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు నిర్మల, అలివేలు, అరుణ తదితరులు

మహిళా సాధికారతే లక్ష్యం

- ఎస్‌హెచ్‌జి గ్రూపులకు రూ.932 కోట్ల రుణాలు
- ఉన్నతి ద్వారా రూ15.52 కోట్ల రుణాలు
- పటిష్టంగా పెన్షన్ల పంపిణీ - ప్రజాశక్తితో డిఆర్‌డిఎ పిడి సలీం బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో రానున్న ఐదేళ్ల కాలంలో మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) ప్రాజెక్టు డైరెక్టర్ సలీం బాషా తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళల పేదరిక నిర్మూలనకు ఉన్నతి పథకం ద్వారా రూ.15.52 కోట్ల రుణాలను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 21,332 పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.932 కోట్ల రుణాలను అందించేందుకు లక్ష్యం పెట్టుకున్నట్లు వివరించారు. జిల్లాలో జిల్లా అభివృద్ధి ప్రణాళిక అమలులో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా గ్రామాల్లో ఉన్న మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆయన ప్రజాశక్తితో ముఖాముఖిగా మాట్లాడారు..

గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

పిడి : ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో జిల్లాలో రానున్న ఐదేళ్ల కాలంలో పేదరిక నిర్మూలన చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా ప్రణాళికను రూపొందించి జిల్లా కలెక్టర్‌కు సమర్పించడం జరుగుతుంది. పొదుపు సంఘాల ద్వారా మహిళలను చైతన్యం చేసి వారి కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి అవగాహన కల్పించడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఆర్థికంగా కుటుంబాలు అభివృద్ధి అయ్యేందుకు పొదుపు సంఘాల్లోని మహిళలను బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించడం, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఆర్థికంగా కుటుంబాలు బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

పొదుపు మహిళలకు ఏమైనా ప్రత్యేకంగా రుణాలు అందజేస్తున్నారా..?

పిడి : కర్నూలు జిల్లాలో పీఎం ఈజిపి, పిఎం ఎస్ఎంఈ పథకాల ద్వారా 5,750 మంది పొదుపు సభ్యులకు రూ80.50 కోట్లతో ఉమెన్ లెడ్ పథకం కింద రుణాలు ఇప్పించడం జరుగుతుంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గం లోని పొదుపు సంఘాల్లోని మహిళా సభ్యులను ఎంపిక చేసి బ్యాంకులో కూడా జాబితాలను అందించాము. ఈ పథకం కింద మహిళలు తమ కుటుంబాలను మరింత ఆర్థికంగా బలోపేతం చేసుకునేందుకు ఉపయోగ పడుతుంది.

మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందజేసేందుకు ఎలాంటి ప్రణాళిక రూపొందించారు..?

పిడి : జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 21,332 పొదుపు సంఘాల గ్రూపులకు దాదాపుగా రూ.932 కోట్లకు పైగా బ్యాంకు లింకేజీ కింద రుణాలు ఇప్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎప్పటికప్పుడు గ్రామాల్లో గ్రామానికి సంఘాలు మండల స్థాయిలో మండల సమాఖ్యలు, జిల్లా స్థాయిలోని జిల్లా సమాఖ్య సమావేశమై బ్యాంకు లింకేజీ కింద రుణాలు ఇప్పించేందుకు గ్రూపుల వారిగా లక్ష్యాలను నిర్ణయించడం జరిగింది. ఈ ఏడాది వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు జిల్లా కలెక్టర్ సూచనలు కూడా ఇవ్వడం జరిగింది. ఎస్సీ, ఎస్టీ మహిళలలో పేదరిక నిర్మూలనకు ప్రత్యేకంగా రూ15.52 కోట్ల రుణాలను అందించడం జరుగుతుంది.

పెన్షన్ల పంపిణీకి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

పిడి : ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతినెల 2,43,337 మంది లబ్ధిదారులకు రూ.103.54 కోట్ల అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయాల ఉద్యోగుల ద్వారా పెన్షన్ల పంపిణీ చేపడుతున్నాం. వంద శాతం పెన్షన్ల పంపిణీకి ప్రతి నెలా చర్యలు తీసుకుంటున్నాం.

కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారా..?

పిడి : కొత్తగా పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఉత్తర్వులను బట్టి కొత్త పెన్షన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

సాగులో ఉన్న పేదరైతులకు న్యాయం చేస్తాం

రైతులతో కలిసి సాగు భూములలో పర్యటించిన నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం దుపాడు గ్రామం 139 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో పేదలు సాగు చేస్తున్న పొలాలకు పట్టాలు ఇచ్చేవరకు సాగుదారుల పక్షాన నిలబడి ప్రభుత్వానికి విన్నవించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి రైతులకు హామీ ఇచ్చారు. ఆదివారం రైతులతో కలిసి సాగు చేస్తున్న భూములలో ఎంపి బైరెడ్డి శబరి పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరులతో ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా దుపాడు గ్రామ ప్రజలు ప్రభుత్వ భూమి సాగు చేస్తున్నా అధికారులు పట్టాలి ఇవ్వకుండా దగాచేశారని విమర్శించారు. ప్రజా ప్రతినిధులు కూడా బినామీ పేర్లతో కబ్జాలు పెట్టుకున్నారే తప్ప సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేయలేదని పేర్కొన్నారు. ఇక్కడ జరుగుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిజమైన సాగుదారులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దుపాడు గ్రామ రైతులు మహిళలు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి శబరి

హత్య కేసు నిందితుల అరెస్టు

- పత్తికొండ ఇంచార్జ్ డిఎస్‌పి శ్రీనివాస్ చారి

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో ఈనెల 14న టిడిపి నాయకుడు వాకిటి శ్రీనివాసులు హత్య కేసులో నిందితులను పట్టుకున్నట్లు పత్తికొండ ఇన్‌ఛార్జి డిఎస్‌పి శ్రీనివాస్‌చారి తెలిపారు. ఆదివారం పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో టిడిపి నాయకుడు వాకిటి శ్రీనివాసులు హత్య కేసు పై పత్రికా విలేకరుల సమావేశంలో పత్తికొండ ఇన్‌ఛార్జి డిఎస్‌పి శ్రీనివాసచారి వివరాలను వెల్లడించారు. వాకిటి శ్రీనివాసులు హోసూరు గ్రామంలో టిడిపి నాయకుడిగా ఎదుగుతున్నాడు. అతని యొక్క ఎదుగుదలను చూసి ఓర్వలేక అదే గ్రామానికి చెందిన ప్రత్యర్థులు మాజీ బిఎస్ఎఫ్ సర్వీస్ మెన్ గుడిసె నరసింహులు , అతని అనుచరులు బోయ రామాంజనేయులు, ఉలివెని హరికృష్ణ కలిసి గ్రామంలో ఆధిపత్యం ఉండాలంటే వాకిటి శ్రీనివాసులును హతమార్చాలని వడ్డే నరసింహులుతో ముగ్గురు సంప్రదించారు. వారి అభిప్రాయం చెప్పగా అందుకు వడ్డే నరసింహులు రూ. 10 లక్షలు ఇస్తే నా అల్లుడు అయిన వడ్డే కాశీనాథ్(17) అతడు స్నేహితుడు ఎరుకుల వంశీ(16) తో వాకిటి శ్రీనివాసులును హత్య చేయిస్తానని ఒప్పందం కుదురుచుకున్నారు. అడ్వాన్స్ రూ.50 వేలు తీసుకున్నారు. ఈనెల 14న బుధవారం తెల్లవారుజామున ఐదు గంటలకు గ్రామ సమీపంలో వామిదొడ్డి దగ్గర వాకిటి శ్రీనివాసులు బహిర్భూమికి వెళ్లి సెల్ ఫోన్ చూస్తుండగా వడ్డే కాశీనాథ్ వాకిటి శ్రీనివాసులు కళ్ళలోకి కారంపొడి చల్లారు. వెంటనే, ఎరుకుల వంశి ఐరన్ రాడ్‌తో తల వెనక వైపు కొట్టాడు. వడ్డే కాశీనాథ్ కత్తితో తలపై నరికాడు. వాకిటి శ్రీనివాసులు అక్కడికక్కడే మతి చెందారు. పోలీసులు వాకిటి శ్రీనివాసులు హత్య కేసులో దర్యాప్తు చేయగా ఆధిపత్య పోరు కోసం హత్యచేసినట్లు తేలింది. గుడిసె నరసింహులు, బోయ రామాంజనేయులు, ఉలివేణి హరికృష్ణ, వడ్డే నరసింహులను, వడ్డే కాశీనాథ్, ఎరుకుల వంశీలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మోటార్ సైకిల్ ను, ఒక ఐరన్ రాడ్ ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మైనర్లను జిల్లా న్యాయస్థానం ముందు, నలుగురు నిందితులను పత్తికొండ న్యాయ స్థానం ముందు హాజరు పరుచనున్నారు. సమావేశంలో పత్తికొండ అర్బన్ సిఐ జయన్న, పత్తికొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు, దేవనకొండ సిఐ శ్రీనివాసులు, ఎఎస్ఐ వేముల నాయక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జ్ డిఎస్‌పి శ్రీనివాస్ చారి

నూతన కమిషనర్

సమస్యలపై దృష్టి సారించేనా..?!

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్‌ను పరిధిలో పలుసమస్యలు వెంటాడుతున్నాయి. కొత్తగా బాధ్యతలు స్వీకరించే కమిషనర్ అయినా పరిష్కరిస్తారని నగర ప్రజలు బోలెడు ఆశలతో ఎదురు చూస్తున్నారు. నగరంలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి, మురుగు కాల్వ నీరు నిలిచి కంపు కొడుతూ దోమలు ఎక్కువయ్యాయి. నగరంలో కుక్కల సమస్య రోజురోజుకు పెరిగిపోతుంది. అవి పిల్లలపై దాడులు చేస్తున్నాయి. పిల్లలు బయట తిరగాలంటే తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వాటిని నియంత్రించేందుకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. రోజుకు 20 కుక్కలకు ఆపరేషన్లు చేయడం వల్ల వాటిని నిర్ణయించరించ లేకపోతున్నారు. ఇదే సమయంలో కుక్కల ఆపరేషన్లు చేసే ఏజెన్సీకి ఆపరేషన్లు చేసేందుకు కావలసినటువంటి సర్టిఫికెట్ లేదంటూ మేనక గాంధీ నుండి కలెక్టర్‌కు ఫోన్ రావడంతో ఈనెల 8 నుండి కుక్కలకు చేసే ఆపరేషన్లను ఆపేశారు. పార్కులో కబ్జాకు గురవుతున్నాయి. నాడు నేడు ఉన్న అధికార పార్టీలకు చెందిన కార్యకర్తల అండదండలతో పార్కులను కబ్జా చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రోడ్లను, బఫర్‌జోన్‌లో ఉన్న స్థలాల్లో కూడా కబ్జా చేస్తూ దర్జాగా ఇండ్లను నిర్మిస్తున్న పట్టణ ప్రణాళిక విభాగంలో సిటీప్లానర్ లేకపోవడంతో, ఎవరి స్థానంలో వారు ఎవరికి అందిన కాడికి వారు నాయకులు అధికారులు డబ్బులు దండుకుంటూ వదిలేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కర్నూలు నగరంలో అధికారులను ప్రసన్నం చేసుకొని ఇండ్లకు నీటి కొళాయిలను ఎలాంటి డిపాజిట్లు లేకుండా కనెక్షన్లు తీసుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వాటిని వెంటనే ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్ని అక్రమ కన్వెన్షన్లు ఉన్నాయి. అనేది గుర్తించాల్సిన అవసరం ఉంది. ఇంటి పన్నులు వేసే విషయంలో కూడా రెవెన్యూ అధికారులు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ నిబంధనలకు నీళ్ల వదిలి తక్కువ పన్నులను వేస్తున్నారని విమర్శలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. నిబంధన ప్రకారం ఉన్నాయో లేదో నగరంలో ఉన్నటువంటి అధికారులతో కాకుండా థర్డ్ పార్టీతో విచారణ చేస్తే అధికారులు బండారం బయటపడుతుంది. గుర్రాన్ని తోలే రౌతు హుషారుగా ఉంటే గుర్రం హుషారుగా పరుగులు తీస్తుంది. అలాకాకుండా నాకెందుకులే నా జీతం నాకు వస్తుంది అని ప్రజల సమస్యలు గాలికి వదిలేయడంతో అన్ని విభాగాల్లోని అధికారులు తనకు తోచిన విధంగా అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. అవినీతి పెరిగిపోయింది. ప్రస్తుతం నగరపాలక సంస్థలు పనులు త్వరగా కావాలంటే అధికారుల చేతులు తడపాల్సిందే అనే విధంగా తయారయ్యారు. మామూలు ఇవ్వకుంటే వారి పనులు త్వరగా పూర్తి కావు. పనులు త్వరగా కావాలని నేపంతో పనులు చేయించుకునే వారు కూడా ఎంతో కొంత ఇచ్చుకుంటూ పనులు చేయించుకుంకుటున్నారు. అందుకు అలవాటు పడిన అధికారులు మామూల్లు ముట్టందే ఫైలు ముందుకు కదలడం లేదు. ఇక నగరాభివృద్ధి లో భాగంగా రోడ్లు డ్రైనేజీలు కల్వర్టులు పైప్లైన్లు ఇలా ప్రతి ఒక్క పనిలో పర్సంటేజీలు లేనిది పనులు ముందుకు సాగడం లేదు. దీనికి తోడు ప్రభుత్వం అభివృద్ధి పనులకు రావాల్సిన బిల్లులు రాక పోవడంతో కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. క్లాప్ డ్రైవర్ల కు 7 నెలలుగా జీతాలు లేక కుటుంబాలు గడవక అధికారుల చుట్టూ, నాయకుల చుట్టూ తిరుగుతూ వినతులు ఇస్తూ ఉన్న వారి మొర ఆలకించేవారు లేకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సురోమని మనుషులంటే దేశమేగి తినవా బాగుపడునోయ్ అనే గురజాడ అన్న విధంగా ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి అభివృద్ధి వైపు అడుగులు వేసే విధంగా ప్రయత్నించాలి. ఆ విధంగా నూతన కమిషనర్ నగర సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు రాబట్టే విధంగా కృషి చేసిన నాడే సమస్యలు అన్ని సర్దుమడుగుతాయి. నగరం స్మార్ట్ సిటీగా మారుతుంది. నూతన కమిషనర్ నాయకుల కు తలోగ్గ కుండాతనదైన శైలిలో పనులు చేసి ప్రజల మన్ననలను పొందాలని ఆకాంక్షిస్తున్నారు.

నూతన కమిషనర్ విద్యాధరి

హైటెన్షన్ 11కె వి కరెంట్ లైన్‌కు ఎబిస్విచ్ ఏర్పాటు

-కరెంటు అంతరాయం నుండి ఆసుపత్రి కి విముక్తి

-జిజిహెచ్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కరెంట్ కష్టాలు ఉన్న విషయం తెలిసిందే.. ఇక్కడ సమీపంలో ఉన్న 33 కెవి సబ్ స్టేషన్ నుంచి హై టెన్షన్ లైన్ ద్వారా కరెంటు ఆసుపత్రిలోకి వచ్చేటప్పుడు ట్విల్టింగ్ అంటే (వర్టికల్) ఎబిస్విచ్ ద్వారా పవర్ సప్లయ్ వచ్చేది. ఈ పద్ధతి 30 ఏళ్ల నుంచి ఉండి చాలా పాతగా అయిపోయి అవి చెడిపోవడం వలన తరచుగా కరెంటుకు అంతరాయం కలిగేది. అంతేకాకుండా దీని ద్వారా అంతరాయం ఆసుపత్రిలో ఉండే పవర్ స్టేషన్ కే కాకుండా బయట ఉన్న 33 కెవి సబ్‌స్టేషన్‌కు కూడా పాకి అక్కడ కూడా కరెంటు ట్రిప్ అయిపోయేది. దీనివలన బుధవారపేట, కలెక్టర్ ఆఫీసు మిగతా చోట్ల కూడా కరెంటు పోతూ సమస్య ఉత్పన్నమయ్యేది. కరెంటు ఈ ఏరియాలలో ట్రిప్పు అయినప్పుడు అది ఎక్కడ పోయింది అని తెలుసుకోవడం కోసం ఎస్‌పిఎస్‌డిపిఎల్ ఇంజనీర్ కు తలకు మించిన భారం అయిపోయేది. అది కనుక్కునేందుకు బాగా టైం పెట్టేది. ఈ సమస్య చానా రోజుల నుంచి ఉంది. కానీ శనివారం నా దష్టికి జాన్ బెర్నాడ్ ఎపిఎస్ఐబి ఇంజనీర్ తీసుకొచ్చారు. మీరు ఈ సమస్యను పరిష్కరించండి మాకు తలనొప్పిని తగ్గించండి అని చెప్పారు. ఇందుకు ఏమీ ఆలస్యం లేకుండా చేసేయండి అని అన్నాను.. మీరు ఎపిఎంఎస్ఐడిసి ఇఇకి తెలపండి అని చెప్పారు. శివకుమార్ ఎపిఎంఎస్ఐడిసి తో మాట్లాడితే సార్ దానికి కొంచెం డబ్బులు ఖర్చవుతాయి అందుకనే లేట్ అవుతావుంది అని అన్నారు. సరే ఆలస్యం ఎందుకు కానిచ్చేయండి ఎంత ఖర్చైనా నేను భరిస్తాను అని చెప్పాను. ఎందుకంటే అసలే మాకు చాలా కరెంటు ఫ్లక్చువేషన్ లు రావడం వల్ల ఎక్విప్‌మెంట్ చెడిపోయి సమస్య వచ్చే అవకాశం ఉంటుంది అని తెలిపాను. వెంటనే చక చక పనులు చేయమని ఎపిఎంఎస్ఐడిసి ఏపీఎమ్ యస్ ఐడిసి ఇఇ శివకుమార్‌ను ఆదేశించాం. అసిస్టెంట్ ఇంజనీరు శివలింగం ఇక రంగంలోకి దిగారు. పని చేయాలంటే కాంట్రాక్టు పద్ధతిలో చాలా స్కిల్డ్ వర్కర్స్ కావాలి ఎందుకంటే హై టెన్షన్ లైన్లతో పని ఏమైనా సమస్య వస్తే ప్రాణాలు పోతాయి. అంతేకాకుండా కరెంటుకు ఓ గంటసేపు ఆసుపత్రిలో అంతరాయం కలుగుతుంది. ఈ రోజు 12 గంటల నుంచి ఒంటిగంట సమయంలో దీని మధ్యన మేము అన్ని జాగ్రత్తలు తీసుకొని ఈ పనికి శ్రీకారం చుట్టాం అందరూ కూడా చక చక పని చేయడం మొదలుపెట్టారు. దీనిని హారిజంటల్ ఎబి స్విచ్‌కు మార్చడం జరిగింది.. దీని వలన ఇకపై ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవకాశం కలుగుతుంది. ఇందుకు సహకరించిన ఆయా శాఖల అధికారులకు డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు

విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగరంలోని గడియారం ఆసుపత్రి సమీపంలో ఉన్న ఉర్దూ ఉన్నత పాఠశాలలో 57 పంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1200 చొప్పున ఉపకార వేతనాన్ని ఫ్రెండ్స్ జకాత్ ట్రస్ట్ ఫర్ ఎడ్యుకేషన్ వారు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ ట్రస్ట్ అధ్యక్షులు సయ్యద్ మహబూబ్ పీర్, ట్రస్ట్ సభ్యులు ఎస్.ఇస్మాయిల్ బాషా, తహా మహమ్మద్ , జహీర్ అహ్మద్, ప్రతి విద్యార్థి ఈ ఉపకారవేతనాన్ని వారి విద్యాభివృద్ధికి మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. విద్య ప్రతి విద్యార్థి వ్యక్తిత్వాన్ని పెంచి అభివృద్ధి పథంవైపు నడిపిస్తుందని, ఎన్ని కష్టాలు ఎదురైనా వెరవకుండా ఆత్మస్థైర్యం తో చదువుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.పుష్పరాజ్ , పాఠశాల సహాయకులు, తదితరులు పాల్గొన్నారు,.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న పాత నేరస్తులకు ఆదివారం పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ అశోక్ కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు, మట్కా బీటర్లు, నాటు సారా తయారు చేసి అమ్మే వాళ్లతో సమావేశం నిర్వహించి కౌన్సిలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక పనులు మానుకొని మంచి ప్రవర్తనతో మెలగాలని. లేనిచో చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పోలీసు సిబ్బందితో కలిసి ఎస్ఐ పాత బస్టాండ్ సర్కిల్ లో ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా షాపుల యజమానులు సహకరించాలన్నారు. రోడ్డుపైన మోటర్ బైకులు నిలపకుండా చూసుకోవాలని వారికి సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన తెలపుతున్న కాంగ్రెస్ నాయకులు

వైద్యురాలి హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

- కాంగ్రెస్ జిల్లా సహాయ కార్యదర్శి అమానుల్లా

ప్రజాశక్తి-హోళగుంద

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ జిల్లా సహాయ కార్యదర్శి అమానుల్లా అన్నారు. ఆర్‌జి కార్ వైద్య కళాశాలలో పిజి వైద్యురాలిపై హత్యాచార ఘటన బాధాకరమన్నారు. రోజుకి రోజు రోజుకి మహిళలపై అత్యాచారాలు పెరిగి మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దిశ, నిర్భయ, పోక్సో ఇలా ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ ఎటువంటి రక్షణ లేదని అన్నారు. తల్లి జన్మనిస్తే డాక్టర్లు పునర్జన్మ ఇస్తారని అటువంటి వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడం బాధాకరమన్నారు. తక్షణమే సెంట్రల్ ప్రొటెక్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాంటి ఘటనలు జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

నేలకొరిగిన వృక్షం..తప్పిన ప్రమాదం

- బాధితులకు న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆదోని

ఆదోనిలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి భారీ వృక్షం రేకుల గుడిసెపై కూలిన సంఘటన ఆదోనిలోని తిక్కస్వామి దర్గా వెనుక ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు నాగరాజు, లక్ష్మి తెలిపిన వివరాల మేరకు ఈదురుగాలులు వీచి వృక్షం కూలినప్పుడు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణహానీ జరగలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలైన తమను ఆదుకోవాలని కోరారు. ఈదురుగాలులు, వర్షానికి భారీ వృక్షం పూరి గుడిసెపై కూలి నష్టపోయిన బాధితులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితుడు ఈరన్న కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం కోసం జాతీయ విపత్తు సంస్థ, రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆర్ఐ, విఆర్ఓ ఉన్నారు.

అధికారులను బెదిరించడం ఎమ్మెల్యేకు తగదు : టిడిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

అధికారులను బెదిరించడం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి తగదని టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి హితవు పలికారు. ప్రోటోకాల్ పాటించకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై కోర్టుకు వెళ్తామని శనివారం కౌతాళం మండలం సర్వ సభ్య సమావేశంలో హెచ్చరించడం పట్ల ఆయన స్పందిస్తూ.. మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో ఆదివారం మాట్లాడారు. మీ వైసీపీ నాయకుడు జగన్ మోహన్ రెడ్డి, వైసిపి ఎమ్మెల్యేలు, మండలాల నాయకులు, కార్యకర్తలతో చేసిన అవినీతి బయట పడుతుందనే భయంతోనే అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులు అవినీతి ఎంత చేశారో బయట పెట్టే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. మీరు చెప్పే మాటల్లో నిజాయితీ, చేసిన పనుల్లో నీతి ఉంటే మీరు హైకోర్టుకు పోవాల్సిన అవసరం లేదన్నారు.

నిలిచిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

రూ .33 కోట్లతో చేపట్టనున్న కాంప్లెక్స్

ప్రజాశక్తి - ఆదోని

పునాదులకే పరిమితమైన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

ఆదోని పట్టణంలో చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితులు అన్ని వ్యవస్థలపై ప్రభావితం చూపుతోందని పురవాసులు చెబుతున్నారు. పాత బస్టాండు మైదానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి వైసిపి ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి భూమి పూజ చేశారు. పనులు నిర్మాణం కొరకు రూ 33 కోట్ల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అవుతుందని అధికారులు తెలిపారు. సజావుగా పనులు ప్రారంభమయ్యాయి.

నిలిచిన పనులు : షాపింగ్ కాంప్లెక్స్ కోసం లబ్ధిదారులు వాటా కింద రూ.మూడు కోట్ల వరకు వాటా చెల్లించినట్లు అప్పట్లో అధికారులు తెలిపారు. వారి భాగస్వామ్యంతో కాంప్లెక్స్ కొరకు రూ.33 కోట్లు అవసరమని టెక్నికల్ శాంక్షన్ కూడా అయిందని పనులు మొదలుపెట్టారు.

రాజకీయాలే కారణమా : రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితులు వల్ల ఆదోనిలో కూటమి తరపున బిజెపి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్నికల ఫలితాలు వెలవడిన ప్రారంభంలో పనులు జరిగాయి. గ్రౌండ్ లెవెల్ నుండి బీమ్స్ వరకు పనులు జరిగాయి. సజావుగా పనులు జరుగుతున్నాయి అనుకుంటున్న నేపథ్యంలోనే బ్రేక్ పడింది. దీనికి రాజకీయ కారణాలా, సాంకేతిక కారణాల అన్నది అర్థం కాని పరిస్థితి. అధికారులను అడిగితే పొంతన లేని సమాధానం వస్తుందని డిపాజిట్ చెల్లించిన వారు చెబుతున్నారు. పనులు ప్రారంభంలో అప్పటి మున్సిపల్ ఎస్ఇ శ్రీనాథ్ రెడ్డి పనులను పరిరక్షించి త్వరలోనే పనులు పూర్తయితాయని చెప్పిన కార్యరూపం దాల్చలేదు. కాంప్లెక్స్ నిర్మాణం ఇలా పునాది మట్టం గట్టి నేల వచ్చేవరకు తవ్వ కాలు జరిగాయి. పునాది గట్టిగా ఉన్నప్పుడే నిర్మాణం ఎక్కువ కాలం నిలుస్తుందని ఇంజనీర్ల సూచన మేరకు పనులు మొదలయ్యాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లో సుమారు 180 గదులు నిర్మాణం జరగాల్సి ఉంది. గ్రౌండ్ ఫ్లోర్ లో 77 ,ఫస్ట్ ఫ్లోర్లో 77, సెకండ్ ఫ్లోర్లో 26 చొప్పున దుకాణాలు నిర్మాణానికి డిజైన్ రూపకల్పన చేశారు. ఒక్కో బ్లాక్‌కు రెండు టాయిలెట్ చొప్పున నిర్మిస్తూనే లిఫ్టు సదుపాయం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి ఫ్లోర్ కు 5 ఎగ్జిట్ ఎంట్రీస్ ఉండేలా రూపకల్పన చేశామన్నారు. అగ్రిమెంటు కాలం ముగిసేలోగా దుకాణాల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని అందులో ఉంది

కాంట్రాక్టర్కు నోటీసు : పనులు ఉన్నపలంగా నిల్పు వేయడం ఏమిటని సమాధానం చెప్పాలని కాంట్రాక్టరుకు నోటీసు పంపినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పనులు జరిగిన దానికి రూ మూడు కోట్ల వరకు బిల్లు చెల్లించినట్లు కూడా చెబుతున్నారు. ఇంతవరకు కాంట్రాక్టర్ నుండి సరైన సమాధానం రాలేదని మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు చెబుతున్నారు కాంప్లెక్స్ నిర్మాణానికి సరిపడా ఇసుక దొరకని కారణంగానే పనులు నిలిపేశారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. డబ్బు చెల్లించిన వారు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఎప్పుడో అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి చొరచూపి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పందికోన రిజర్వాయరుకు నీటి విడుదల పెంచాలి

- రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ,పత్తికొండ మండలాలకు సాగునీరు అందించే పందికోన రిజర్వాయర్‌కు హంద్రీనీవా కాలువ నుండి విడుదల చేసే నీటిని పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీర శేఖర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.రంగారెడ్డి, నాయకులు యూసుఫ్ బాషా, శ్రీరాములు, బజారి డిమాండ్ చేశారు. ఆదివారం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల బృందం హంద్రీనీవా ప్రధాన కాలువను, పందికోన రిజర్వాయర్‌కు నీరు విడుదలయ్యే స్లూయిస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో ఆలూరు, పత్తికొండ రైతులను ఆదుకునే పందికోన రిజర్వాయర్‌కు నీటి విడుదల పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం హంద్రీ నీవా నీటి విడుదల ఆలస్యమైనందున రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పందికోన రిజర్వాయర్ కుడికాలువకు నీటిని విడుదల చేసే గేటు దగ్గర గతంలో అడ్డుకట్టవేశారని, దానిని వెంటనే తొలగించాలని వారు కోరారు. మండల రైతాంగం వర్షాభావ పరిస్థితుల్లో నేపథ్యంలో తీవ్ర ఇబ్బందుల్లో ఉందని అరకొర వర్షాలతో రైతాంగం నిరాశతో ఉందని పేర్కొన్నారు. హంద్రీనీవా ద్వారా వచ్చేటువంటి నీటి విడుదల రైతును ఆదుకుంటుందని ఈ నేపథ్యంలోనే అధికారులు సరైనటువంటి నీటి యాజమాన్య పద్ధతులు అవలంభించాలని రైతాంగం అవసరాలు తగ్గట్టు నీటి విడుదలను చేయాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చొరవ చూపి రైతులను కరువుకు గురికాకుండా ఆదుకోవాలని కోరారు. హంద్రీనీవా ప్రాజెక్టు స్థాయిని 100 టీఎంసీలకు పెంచాలని, పందికోన రిజర్వాయర్ స్థాయిని కూడా పెంచాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సిద్దయ్య గౌడ్, కెపి రాముడు, రమేష్, కారుమంచి పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలను మరో ప్రాంతానికి మార్చొద్దు

: ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు గిరిజన గురుకుల పాఠశాలను మార్చొద్దని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

గిరిజన గురుకుల బాలికల పాఠశాలను మరో ప్రాంతానికి మార్చే ఆదేశాలను అధికారులు వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లి తండ్రులు పాఠశాల ఆవరణలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైన, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గిరిమూర్తి మాట్లాడారు. జిల్లాలోనే ఆలూరు నియోజకవర్గం విద్య, వైద్యం, ఉపాధిలో వెనుకబడిన ప్రాంతమన్నారు. గిరిజన విద్యార్థులకు విద్యను అందించడం ద్వారా వారిని అభివృద్ధి చేయడానికి, విలువలు, సమాజంలో వారి ప్రాముఖ్యతను పెంచడానికి దోహదపడతాయన్నారు. 2016లో నియోజకవర్గ కేంద్రంలో ఉన్న బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల భవనంలోని కొన్ని గదుల్లో గిరిజన గురుకుల బాలికల పాఠశాలను తాత్కాలికంగా ప్రారంభించారని తెలిపారు. పాఠశాలలో ప్రస్తుతం నెరణికి తాండ, అరికెర తాండ, కొత్తపేట గ్రామాల విద్యార్థులు 297 మంది 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో పాటు ట్రిబుల్ ఐటీ సీట్లు, ఇంగ్లీష్ బోధనలో గిన్నిస్ రికార్డు పొందారని గుర్తు చేశారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో పాఠశాలకు సొంత భవనం నిరించడంలో వివక్షత చూపుతున్నారని తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలుర, బాలికలకు గిరిజన ఆశ్రమ పాఠశాలు ఒకే కాంపౌండ్‌లో ఉండడంతో సమస్యగా మారిందన్నారు. గిరిజన గురుకుల బాలికల పాఠశాలను మరో ప్రాంతానికి మార్చే ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని, స్థలం కేటాయించి ఆలూరులోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి షాకీర్ మద్దతు తెలిపారు.

ఉరుకుంద క్షేత్రానికి భారీగా తరలిన భక్తులు

ప్రజాశక్తి - కౌతాళం

ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలలో ఆదివారం ఉరుకుంద క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రతి ఏడాది మూడో సోమవారానికి ఆంధ్ర రాష్ట్రం నుండే కాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివస్తారు. ఇందులో భాగంగా నలువైపుల నుండి భక్తులు భారీగా రావడంతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్, ఫెస్టివల్ అధికారి పాండు రంగారెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పరిశీలించారు. తాగునీటి కోసం ప్రత్యేక ట్యాంకర్లను సిద్ధం చేశారు. స్వామివారి దర్శనం కోసం, టికెట్ల కౌంటర్ల వద్ద, కళ్యాణ కట్ట వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి క్యూలైన్లను కట్టుదిట్టం చేశారు. అర్ధ రాత్రి నుండి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించడానికి కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. కౌతాళం సిఐ అశోక్ కుమార్ కోసిగి, ఆదోని, కౌతాళం వైపు నుండి వస్తున్న వాహనాలను ట్రాఫిక్ సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పుణ్యక్షేత్రం పరిసరాలలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తులకు ఎలాంటి సమస్య వచ్చినా అవుట్ పోస్ట్ పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం

- బిడిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పగడల రమేష్

ప్రజాశక్తి - ఆదోని

మారాజు వీరన్న స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలకు సిద్ధం కావాలని బిడిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పగడల రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం బిడిఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆవరణలో బిడిఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన జాతీయ విద్యా విధానం భావి తరాలకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా విలీన ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున్న పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, యుగంధర్, సాయి, మధు, పవన్, సూరి, శ్రావణ్, వీరేష్, సురేష్ పాల్గొన్నారు.

కుల మతాలకతీతంగా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - ఆదోని

కుల మతాలకు అతీతంగా సమస్యలు పరిష్కరించడానికి ఎంహెచ్‌పిఎస్ పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ అన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ ఆదేశాల మేరకు ఆదోనిలోని కార్యాలయంలో సంతేకుడ్లూరు గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా షేక్ దూద్ పేరా, టిప్పు సుల్తాన్, కార్యదర్శిగా ఎన్ మౌలా సాబ్, సహాయ కార్యదర్శులుగా పి అబ్దుల్, ఐ మహబూబ్ బాషలను ఎన్నుకున్నారు. నూర్ అహ్మద్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేయాలని సూచించారు. నాయకులు వసీం సాహెబ్, కుబేర స్వామి, షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యలు పరిష్కార వేదిక

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాష వెల్లడించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ మండల ,మున్సిపల్ కేంద్రాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్యాధికారి కార్యాలయం ఎదుటే మురుగు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలోని డిప్యూటీ వైద్యాధికారి కార్యాలయం ఎదుటే మురుగు నీరు నిలిచి ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కార్యాలయంలోపులకు వెళ్లాలన్నా... ఆ మురుగులోనే వెళ్లాలి. ఆస్పత్రి ఎదుటే ఇలా ఉంటే రోగాలు ఎలా నయం అవుతాయని, పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు. దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు వస్తున్నాయని నిత్యం ప్రచారం చేసుకునే వైద్య సిబ్బంది ఉంటున్న కార్యాలయం ముందే ఇలా అపరిశుభ్రత నెలకొనడం నిర్లక్ష్యానికి నిదర్శనం అంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది దృష్టి సారించి మురుగు నీరు నిలిచిన ప్రాంతంలో గ్రావెలు వేయించి పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

అనాథలకు దూదేకుల సంఘం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలో గుళ్యం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన ముగ్గురు బాలికలకు దూదేకుల సంఘం ఆర్థిక సాయం అందజేసింది. దూదేకుల సంఘం రాష్ట్ర నూర్ బాషా దూదేకుల సంఘం గౌరవ అధ్యక్షులు సాయి బాబా, ఉపాధ్యక్షులు షేక్షావలి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాలిక్ బాషా ఆదివారం బాలికల గృహానికి వెళ్లి రూ.1.71 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా దూదేకుల సంఘం ఆలూరు తాలూకా అధ్యక్షులు జోహరాపురం సాలి సాబ్, ఆయన సోదరులు నబి రసూల్, అల్లిపీరా, గిద్దలూరు ముజీబూర్ రెహమాన్, పి ఎస్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబసభ్యులకు ఆర్థికసాయం చేస్తున్నపూర్వ విద్యార్థులు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

అమకతాడు గ్రామానికి చెందిన రామానాయుడు అనారోగ్యంతో జులైలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2000-2001 బ్యాచ్‌కు సంబంధించిన లద్దగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతికి చెందిన స్నేహితులు(పూర్వ విద్యార్థులు) తమ బాల్య స్నేహితుని కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.60వేల ఆర్థిక సహాయం అందజేశారు. తమ స్నేహితుడి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో పూర్వ విద్యార్థులు వెంకటరాముడు, జహంగీర్, వలి బాష, శ్రీనివాసులు, కలాం తదితరులు ఉన్నారు.

ఎస్ఎంసి చైర్మన్లు అంకిత భావంతో పని చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

పాఠశాలల్లో జరిగిన మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్ఎంసి చైర్మన్లు అంకిత భావంతో పని చేయాలని మాజీ ఎంపిపి పాముల పద్మావతమ్మ, టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలి, జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్, సీనియర్ నాయకులు సన్నప్ప అన్నారు. మండలంలో రెండు దఫాలుగా జరిగిన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, పోలీస్ సిబ్బందికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలంలో అధిక శాతం టిడిపి మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఎన్నికైన వారందరూ పాఠశాలల అభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని కోరారు. పాఠశాలలో అభివృద్ధి జరిగినప్పుడే విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే నిరుపేదలకు అన్న క్యాంటీన్లు ఎంతో దోహదం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందన్నారు.

ధ్వజారోహణతో ప్రారంభమైన ఆరాధన

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలను పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు ధ్వజారోహణంతో ప్రారంభించారు. ఆదివారం శ్రీ మఠం ప్రాకారం నుంచి పండితుల వేద మంత్రాల మధ్య మంగళ వాయిద్యాల నడుమ ప్రధాన ముఖ ద్వారం చేరుకున్న పీఠాధిపతులు ముఖ ద్వారం పై ఉన్న ధ్వజారోహణాన్ని ఆవిష్కరించారు. అనంతరం గో పూజ అశ్వ పూజ లక్ష్మీ పూజ ధాన్య పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీమఠం ఎఎఓ మాధవ శెట్టి మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి ,ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, శ్రీ మఠం పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్ అప్రమేయచార్, ద్వారపాలక అనంత ఇతర మఠం సిబ్బంది పాల్గొనగా సిఐ రామాంజులు, ఎస్ఐ గోపినాథ్, హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణ ఆధ్వర్యంలో భద్రత కల్పించారు.

స్పృహ కోల్పోయిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రైల్వేస్టేషన్ లో స్పృహ కోల్పోయి చికిత్స పొందుతూ ఉన్న వ్యక్తి మధ్యాహ్నం మతి చెందారని ఆర్‌పిఎస్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 న సుమారు సాయంత్రం 05.30 గంటలకు గుర్తుతెలియని మగ వ్యక్తి, కర్నూలు సిటి రైల్వే స్టేషన్, ప్లాట్ ఫారం 1లో స్పృహ లేకుండా పడిపోయి ఉన్నాడు. ఇది గుర్తించిన రైల్వే ఆర్‌పిఎఫ్ పోలీసు వారు స్టేషన్ మాస్టర్, కర్నూల్ సిటి రైల్వే స్టేషన్‌కు తెలిపి, వెంటనే 108 అంబులెన్సు ద్వారా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స కొరకు అడ్మిట్ చేశారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ 18 న మధ్యాహ్నం 12.33 గంటలకు చనిపోయినాడు. స్టేషన్ సూపరింటెండెంట్, నజియా, ముబీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి శరీరంపై స్కై బ్లూ కలరు హాఫ్ షర్ట్, బ్లాక్ కలరు ఫ్యాంట్, బట్టతల, 2 ఇంచులు నలుపు , తెలుపు రంగు గడ్డం ఆనవాళ్ళు కలిగి ఉన్నాయన్నారు.

ఎత్తు సుమారు 5.6 అడుగులు, చామనఛాయ రంగు కలిగి ఉన్నాడన్నారు.మృతుడికి సంబందిచిన వివరాలు తెలిసిన వారు కెఎంవి ప్రేమ్ కుమార్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, కర్నూలు ఆర్‌పిఎస్ సెల్ 9014586555 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

దేవనకొండ సిఐగా విజయభాస్కర్

ప్రజాశక్తి - దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐగా విజయభాస్కర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నందికొట్కూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న విజయ భాస్కర్ బదిలీపై దేవనకొండకు వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన శ్రీనివాసులు నంద్యాల సిసిఎస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఘర్షణలకు తావివ్వకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నేడు వాలంటీర్ల రాష్ట్రసదస్సు : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : విజయవాడలోని బసవపున్నయ్య భవన్‌లో నేడు నిర్వహించే గ్రామ వార్డు సచివాలయ వాలంటీర్ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాల చెల్లింపు, రూ. 10వేల వేతనం చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని, రాజీనామా చేయించిన వాలంటీర్లు అందరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తదితర డిమాండ్లపై సదస్సులో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. వాలంటీర్లకు పని విధానాన్ని అమలు పరిచి ప్రజలకు దగ్గరయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మహారాజశ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్
సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 241/2023, in O.S. No. 120/2023
Between :-
ఎం. లక్ష్మిదేవి ... అర్జీదారురాలు/వాది
V/s
డి. ప్రమీల మరియు ఇతరులు
... రెస్పాండెంట్స్/ప్రతివాదులు
R11. పి. అనిత, W/o. పి. వెంకటరమణ,
R12. పి. రజని, W/o. లేట్ పి. మునిస్వామి
R13. పి. రమేష్, S/o. పి. వెంకటరమణ లది
R/o. D.No., రామాపురము గ్రామం, లద్దగిరి (పోస్టు) కోడుమూరు (మండలం) కర్నూలు (జిల్లా)
పై దావాలో/అర్జీలో అర్జిదారురాలు/వాది పై నెంబరు గల I.A. లో 11,12 మరియు 13 రెస్పాండెంట్స్/ప్రతివాదులు కోర్టులో హాజరు నిమిత్తం 23-08-2024 న ఉదయం 10.30 గంటలకు వాయిదా పై తెల్పిన కోర్టునందున్నది. కావున మీరు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ పై కోర్టులో ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు కాని యెడల సదరు దావాలోని అర్జీని మీ పరోక్షముగా తీర్మానించెదరు.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది : 23-08-2024
ఎం.శ్రీనివాసులు & బి.లక్ష్మీనారాయణ
అర్జీదారురాలు/వాది తరపు న్యాయవాదులు,
గుత్తి, అనంతపురం జిల్లా.
సెల్ : 9848165583

మహారాజశ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్
సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 120/2023
Between :-
ఎం. లక్ష్మిదేవి ... వాది
V/s
డి. ప్రమీల మరియు ఇతరులు
... ప్రతివాదులు
D11. పి. అనిత, W/o. పి. వెంకటరమణ,
D12. పి. రజని, W/o. లేట్ పి. మునిస్వామి
D13. పి. రమేష్, S/o. పి. వెంకటరమణ లది
R/o. D.No., రామాపురము గ్రామం, లద్దగిరి (పోస్టు) కోడుమూరు (మండలం) కర్నూలు (జిల్లా)
పై దావాలో 11,12 మరియు 13 ప్రతివాదులు కోర్టులో హాజరు నిమిత్తం 23-08-2024 న ఉదయం 10.30 గంటలకు పై తెల్పిన కోర్టు నందు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల దావా మీ పరోక్షముగా తీర్మానించెదరు.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది : 23-08-2024
ఎం.శ్రీనివాసులు & బి.లక్ష్మీనారాయణ
వాది తరపు న్యాయవాదులు,
గుత్తి, అనంతపురం జిల్లా.
సెల్ : 9848165583